రక్తం ఇచ్చి..ఆయువు పెంచి

- ఆపదలో ఆపన్న హస్తాలుగా..
- రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న యువత

సిరిసిల్లఅర్బన్: తల్లిదండ్రులు జన్మనిస్తే..రక్తదానం చేయడంతో పునర్జన్మనిచ్చిన వారవుతారన్న నానుడి. రక్తం ఇవ్వడమంటే సాటి మనిషికి ప్రాణం పోయడమే. ఎలాంటి రక్త సంబంధం లేకున్నా మానవతా దృక్పథంతో ఆపదలో ఉన్నవారిని ఆదకుంటూ రక్తదానం చేసి ప్రాణాలు నిలబెదతున్నారు పట్టణానికి చెందిన పలువురు యువకులు. గర్భిణులకు, శస్త్ర చికిత్సకోసం రక్తం అవసరమున్న వారికి నిత్యం రక్తదానాన్ని అందిస్తూ ఆపద్బాంధవులుగా మారుతున్నారు.



రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న దృశ్యం (ఫైల్)

సండే స్పెషల్

యువతలో పెరుగుతున్న సేవాభావం..

జిల్లా కేంద్రంలో యువతలో సేవాభావం పెరుగుతుంది. పట్టణంలోని పలువురు యువకులు రక్తదానం చేసేందుకు ముందుకువస్తున్నారు. సిరిసిల్ల బ్లడ్ డోనర్స్ సంస్థ, రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఎవరికైనా రక్తం అవసరముంటే సత్వరమే స్పందించి గ్రూప్ సభ్యుడిని పిలిచి రక్తం అందిస్తున్నారు. ఒకప్పుడూ రక్తం ఇచ్చేందుకు ఆలోచించే యువత ఇప్పుడు స్వచ్ఛందంగా ముందుకు వస్తూ ఎంతోమంది ప్రాణాలు నిలబెడుతున్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ రక్తనిధి కేంద్రానికి అందజేస్తున్నారు.



రెడ్ డ్రాప్ ఫౌండేషన్ సభ్యులు

రెడ్ డ్రాప్‌తో ఎంతో మందికి పునర్జన్మ



సిరిసిల్ల పట్టణానికి చెందిన అస్లాం దాదాపు 32 సార్లు రక్తదానం చేసి ఎంతోమంది ప్రాణాలు నిలిపాడు. ఐదేళ్ల క్రితం రెడ్ డ్రాప్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. వందలాది మంది సభ్యులతో రక్తదానం చేయించాడు. రక్తదానంపై యువకుల్లో అవగాహన కల్పిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిస్తున్నాడు. ఎన్నోసార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి రక్తనిధి కేంద్రానికి అందజేశారు. అస్లాం చేస్తున్న సేవలకు గత జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే నుంచి మన్ననలు పొందాడు. ఇటీవలే మంత్రి కేటీఆర్ నుంచి ప్రశంసలు అందుకున్నాడు. రక్తం అవసరమున్నవారు 9885975566 నెబంర్‌ను సంప్రదించాలన్నారు. రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు.

– అస్లాం, రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ప్రతినిధి

సామాజిక బాధ్యతగా



రగుడుకు చెందిన వంగ అనిల్ కుమార్ దాదాపు 18 సార్లు పైగా రక్తదానం చేశాడు. అత్యవసర సమయంలో రక్తదాతగా మారి తనవంతు సాయం చేస్తున్నాడు. సొంత ఖర్చులతో దూర ప్రాంతాలకు సైతం వెళ్లి రక్తదానం చేస్తున్నాడు. తనతో పాటు స్నేహితులను చైతన్య పరుస్తూ రక్తదానం చేయడంలో తనవంతు బాధ్యతను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. –వంగ అనిల్‌కుమార్‌గౌడ్

48 సార్లు రక్తదానం



సిరిసిల్లకు చెందిన మోబీన్ అనే యువకుడు ఇప్పటివరకు 48 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలుస్తున్నాడు. మోబీన్ రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాడు. కరోనా సమయంలో బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితుల్లో రక్తం అవసరం అన్న వారికి నేనున్నానంటూ ఎందరికో రక్తం ఇచ్చాడు. ఎలాంటి అపోహలకు తావివ్వకుండా రక్తదానం చేసేందుకు యువకులు ముందుకురావాలని వారిలో చైతన్యం కల్పిస్తున్నాడు. – రక్తదానం చేస్తున్న మోబీన్

18 సార్లు రక్తం అందించి



సిరిసిల పట్టణానికి చెందిన నెల్లుట్ల రాహుల్ అనే యువకుడు 18 సార్లు రక్తదానం చేశాడు. ఎవరికైనా అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉందంటే వెంటనే స్పందించి ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాడు. దీంతో పాటు సామాజిక బాధ్యతగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. – నెల్లుట్ల రాహుల్

ఎంపీ బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం



వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



జిల్లెల్లలో బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గంభీరావుపేటలో..

సిరిసిల్ల/గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్ /వీర్నపల్లి/ఇల్లంతకుంట/తంగళ్లపల్లి/వేములవాడ / వేములవాడ అర్బన్/రుద్రంగి/ బోయినపల్లి/చందుర్తి/కోనరావుపేట/ సిరిస్లి వేములవాడ, నియోజకవర్గాల్లో శనివారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమర్ దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆందోళనలు నిర్వహించారు. బాధ్యతగల హోదాలో ఉండి మహిళ పట్ల కనీస గౌరవం లేకుండా, సభ్య సమాజం తలదించుకునేలా అసభ్యకరంగా మాట్లాడారని విమర్శించారు. పలుచోట్ల బండి సంజయ్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో ప్రతిపక్షాలను భయపెట్టిస్తుందని, ప్రజలు బీజేపీకి త్వరలో గుణపాఠం చెబుతారని వారు పేర్కొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కోనేరులో చక్రస్నానం చేయిస్తున్న స్వాములు

ముస్తాబాద్ (సిరిసిల్ల): మండలంలోని గూడెంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం జరిగాయి. నిత్యహవనం, మహా పూర్ణాహుతి, బలిహరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆంజనేయస్వామి మన్య సూక్తం హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, సర్పంచ్ చిట్నేని సరిత, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్నేని అంజన్‌రావు, శ్రీనివాస్ రావు, విద్యాసాగర్ రావు, గిరి, వేంకటేశ్వర్ రావు, వేద మూర్తులు ప్రవీణా చార్యులు, శ్రీకాంతాచారి, లక్ష్మణా చారి, శ్రీ వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

తంగళ్లపల్లి : మండలంలోని మండెపల్లి రజక సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. రజక సంఘం అధ్యక్షుడిగా దుబ్బాక వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా పోతరాజు తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక రవి, కోశాధికారిగా దుబ్బాక శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా పోతరాజు మమత, సరిత, రత్నవ్వ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రజక సంఘం పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు అభినందనీయం

- రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజలింగం



మాట్లాడుతున్న మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడు రాజలింగం

బోయినపల్లి: గ్రామీణులకు కరీంనగర్‌కు చెందిన శ్రీసాయి లైఫ్‌లైన్ ఆస్పత్రి నిర్వాహకులు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమని తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ వైరాగ్యం రాజలింగం కొనియాడారు. మండలంలోని కొదురుపాకలో ఐఎంఏ, లైఫ్‌లైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీసాయి లైఫ్‌లైన్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ సీహెచ్.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ పదండి పోదాం పల్లెకు కింద కొదురుపాక గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రతీ నెల మొదటి ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. దాదాపు 700 మందికి వైద్యపరీక్షలు చేసి, మందులు అందించారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బీఎస్.రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ జోగినిపల్లి శ్యామలాదేవి, సింగిల్‌విండో చైర్మన్ జోగినిపల్లి వెంకట్రామారావు, బీఆర్ఎస్ మండల ధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య పాల్గొన్నారు.

బీజేవైఎంలో చేరిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన దాదాపు 20 మంది యువకులు బీజేవైఎంలో శనివారం చేరారు. బీజేవైఎం అధ్యక్షుడు జితేందర్ రెడ్డి కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన కంచర్ల రోహిత్‌ను మండల యువమోర్చా ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు ఆయన తెలిపా రు. పార్టీ అభివృద్ధికి ప్రతీ కార్యకర్త కృషిచేయా లని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు దయాకర్ రెడ్డి, సనత్ రెడ్డి, దిలీప్, మదు, ప్రవీ ణ్ అభిలాష్, సందీప్, లోహిత్, రాకేశ్, తదితరులున్నారు

ఇంటింటా వైద్య పరీక్షలు

కోనరావుపేట: మండలంలోని శివంగాలపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాల్లో చల్మెడ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహించారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య"పరిస్థితి గురించి వైద్యులు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామాల్లోని ప్రజల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిఒక్కరూ ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకో వాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు శివంగాల సురేశ్ యాదవ్, దండు ఎల్లవ్వ, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



శివంగాలపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

క్లుప్తంగా

అలరించిన నృత్యాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

రుద్రంగి: మండలకేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎలిగేటి నరేశ్,గంగ నర్సయ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



నిమ్మపల్లిలో బోనాలు తీస్తున్న మహిళలు

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యాదవ సంఘం మహిళలు బైండ్ల కళాకారుల నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి బోనాలను నైవేద్యంగా సమర్పించారు.

ప్రొసీడింగ్స్ పంపిణీ



ప్రొసీడింగ్స్ అందిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లిలో శనివారం సర్పంచ్ ఆరెపల్లి లత, ఎంపీటీసీ ఈడుగు రాజేశ్వరి మహిళా స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాల ప్రొసీడింగ్స్ కాపీలను అందజేశారు. గ్రామంలోని 35 స్వశక్తి సంఘాలకు సుమారు రూ. 6,59,893 విలువ గల ప్రొసీడింగ్స్ కాపీలను ఆయా స్వశక్తి సంఘాలకు చెందిన మహిళలకు అందించారు. కార్యక్రమంలో ఐకేపీ ఇన్‌చార్జి ఏపీఎం చెంద్రయ్య, సీసీ గుంటి లక్ష్మణ్, నాయకులు ఆరెపల్లి రాజు, ఈడుగు స్వామి, స్వశక్తి సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆటోనగర్ యూత్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



సిరిసిల్ల: పట్టణంలోని ఆటోనగర్ యూత్ అధ్యక్షుడిగా పోతుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆటోనగర్ యూత్ అధ్యక్ష పదవికి శనివారం ఎన్నికలు జరిగాయి అధ్యక్ష స్థానం కోసం ముజీం, శ్రీనివాస్, శ్రీను నాయక్ ముగ్గురు పోటీపడగా ఎన్నికలు నిర్వహించారు. 86 ఓట్ల తేడాతో పోతుల శ్రీనివాస్ విజయం సాధించారు. ఆటోనగర్ అభివృద్ధికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శ్రీనివాస్ తెలిపారు. ప్రమాణ స్వీకారం రోజు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని ఆటోనగర్ యూత్ ప్రతినిధులు తెలిపారు.

బలగం సినిమాకు గోరింటాల వృద్ధులు



సినిమా థియేటర్‌లో గోరింటాల వృద్ధులు

గంభీరావుపేట(సిరిసిల్ల): సిరిసిల్లకు చెందిన ఎల్దండి వేణు దర్శకత్వంలో రూపొందిన 'బలగం' సినిమాకు పల్లెల్లో విశేష ఆదరణ లభిస్తోంది. గంభీరావుపేట మండలం గోరింటాల నుంచి సుమారు 50 మంది సీనియర్ సిటిజన్లు, వృద్ధులు శనివారం సినిమా చూసేందుకు తరలివెళ్లారు. పల్లెలు, బంధాలు, అనుబంధాల ఇతివృత్తంతో తీసిన సినిమా బాగుందన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఇల్లంతకుంట: మండలంలోని పెద్ద లింగాపూర్, అనంతారం, రహీంఖాన్ పేట, ఇల్లంతకుంట గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పర్యటించనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహా రెడ్డి తెలిపారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పత్తి దగ్ధం

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని లింగంపల్లిలో కరెంట్ తీగలు అంటుకుని పత్తి దగ్ధమైంది. గ్రామానికి చెందిన ఓ వ్యాపారీ రైతు వద్ద కొనుగోలు చేసుకుని వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో అంబేడ్కర్ యూత్‌కు సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు క్రికెట్ కిట్లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువకులు ఉన్నత లక్ష్యంతో ఎదగాలన్నారు. క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందన్నారు.

రైతుల కోసమే మల్లన్నసాగర్ ప్రాజెక్టు



రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: రైతుల కోసమే సీఎం కేసీఆర్ మల్లన్న సాగర్ ప్రాజెక్టు నిర్మించారని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. బందనకల్, వెంకట్రావుపల్లెలో మల్లన్నసాగర్ కెనాల్ నిర్మాణంలో భూములు కొల్పోతున్న రైతులతో శనివారం ఎంపీపీ మాట్లాడారు. ప్రభుత్వం నిర్మించే ప్రాజెక్టులతో రైతులకు సాగునీరు అందుతుందన్నా రు. భూములు కోల్పోయే రైతులకు పరిహా రం అందిస్తామని తెలిపారు. రైతులు ఆందోళన విరమించగా పనులు ప్రారంభించారు. సర్పంచ్ ల క్ష్మణ్, నరేశ్, డీఈ శ్రీనివాస్, అధికారులున్నారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసిన ఐఎంఏ సభ్యులు



పూలమొక్కను అందిస్తున్న ఐఎంఏ సభ్యులు

సిరిసిల్ల అర్బన్ : జిల్లా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నూతనంగా నియమాకమైన చంద్రశే ఖర్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా ఐఎంఏ అధ్యక్షుడు డా. పెంచలయ్య, జిల్లా ఆస్పత్రి సూపరింటిండెంట్ మురళీధర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వసంతరావు, సిద్దిపేట వైద్య కళాశాల ప్రొఫెసర్ చందర్, తదితరులున్నారు.

సబ్బండ వర్గాల అభివృద్ధే లక్ష్యం



మహిళా సంఘం భవనానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల): రాష్ట్రంలో సబ్బండ వర్గాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని సిరిసిల్ల సెస్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిక్కాల రామారావు అన్నారు. శనివారం మండలంలోని మండెపల్లిలో ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి మహిళా సంఘం భవనానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. మహిళా సంఘం భవనానికి రూ.20 లక్షలు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేసిన మహిళలు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, సింగిల్‌విండో చైర్మన్ దేవదాస్, వైస్ చైర్మన్ రమణా రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగారెడ్డి, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గనప మదన్ రెడ్డి, పడిగెల రాజు, మహిళా సంఘం నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలి



మాట్లాడుతున్న భూపాల్ రెడ్డి

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ప్రతినెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శివనగర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ తేదీ వచ్చినా ప్రభుత్వం జీతాలు చెల్లించలేదని, ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ద ం మాల రమనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పురం వాసు దేవరావు, సత్తు రవీందర్, కార్యదర్శులు భాస్కర్, చంద్రశేఖర్, రాజేందర్, మనోహర్ ఉన్నారు.

టెలికాం సేవలు విస్తరించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ భారత

కోనరావుపేట : మారుమూల గ్రామాలకు టెలికాం సేవలను విస్తరింపజేయాలని సర్పంచ్ కొక్కుల భారత కోరారు. మండలంలోని మామిడిపల్లికి ఎయిర్‌టెల్ నెట్‌వర్క్ రావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా జోనల్ మేనేజర్ వీరశేఖర్ మాట్లాడుతూ.. గ్రామంలో త్వరలోనే 5జీ సేవలు అందిస్తామన్నారు. టీఎం రాజేశ్, మండల డిస్ట్రిబ్యూటర్ కొండ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద పోస్టులు పెడితే కేసు

ఇల్లంతకుంట: వాట్సాప్ గ్రూపుల్లో వ్యక్తుల గురించి , రాజకీయ పార్టీలు, కుల మతాల మధ్య మనోభావాలు దెబ్బతీసే విధంగా పోస్టులు పెట్టినా కామెంట్స్ పెట్టి షేర్ చేసినా గ్రూప్ అడ్మిన్‌తో పాటు, పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై మామిడి మహేందర్ తెలిపారు.

హుండీ లెక్కింపు



చందుర్తి: మండలంలోని బండపల్లి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కటకం మల్లేశం తెలిపారు. ఈనెల 2నుంచి 7వరకు సాగిన ఆలయ బ్రహ్మోత్సవాలో ఆలయానికి రూ.3.21లక్షల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు ఏనుగు లచ్చిరెడ్డి, కోశాధికారి చింతలపెల్లి మునీందర్ రెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు అంబాల రామస్వామి, చింతలపెల్లి మహిపాల్ రెడ్డి, మద్దిరాల సత్యనారాయణ, అంబాల శ్రీకాంత్, గసికంటి రామస్వామి, మల్యాల గంగనర్సయ్య, కట కం చంద్రయ్య, బుర్ర వెంకటిగౌడ్, మల్యాల ఆంజ నేయులు, రాచకొండ లచ్చయ్య, మర్రిపెల్లి రా మయ్య, వడ్నాల శంకరయ్య పాల్గొన్నారు.